క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి ఆపన్నహస్తం



స్నేహితుడి భార్యకు నగదు అందిస్తున్న స్నేహితులు

బత్తలపల్లి: తమతో పాటు విద్యను అభ్యసించిన స్నేహితుడు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి స్నేహితులు ఆపన్నహస్తం అందించారు. బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో తమతో పాటు విద్యను అభ్యసించిన బత్తలపల్లికి చెందిన బోయ సాకే ఉమామహేష్ పది రోజుల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు చిరంజీవి, వెంకటరమణ, రంగానాయుడు, రవికుమార్, నారాయణస్వామి, దాదావలి, నాగేష్, రాములు తమ వంతు సాయంగా రూ.50,000 ఉమామహేష్ భార్య రాణిని స్వగృహంలో కలిసి అందజేశారు. తమ తోటి మిత్రుడు అర్ధాంతరంగా చనిపోవడంతో తమకు ఎంతో బాధ కలిగించిందని, వారి బాధను తెలుసుకుని తమకు తోచినంత సహాయం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మృతుని భార్య వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న యువర్స్‌ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులు 96 మందికి కంటి పరీక్షలు చేయగా 46 మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారు. వారందరికీ ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. యువర్స్ ఫౌండేషన్ క్యాంపు చైర్మన్ పోలా ప్రభాకర్, సభ్యులు చాంద్‌బాషా, వైకే శ్రీనివాసులు, సుంకు సుకుమార్, కౌన్సిలర్ పెనుజూరు నాగరాజు, నాగార్జున, సత్రసాల మల్లికార్జున, రమేష్ బాబు, ఓపీ ప్రసాద్, సికిందర్, రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బర్ధన్ కాలనీలో సదుపాయాలు కల్పించండి

కదిరి టౌన్: పట్టణంలోని బర్ధన్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కదిరప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కాలనీలో ఆయన నాయకులతో కలిసి పర్యటించారు. కాలనీలో రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమై సీపీఐలో సభ్యత్వ నమోదు చేయించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రమణ, జిల్లా కౌన్సిల్ కొండయ్య, సీపీఐ నాయకులు అంజనేయులు, నరసింహులు, రంగప్ప,పాలగిరి శీన, భాగ్యమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కదిరి టౌన్: మహిళపై దాడి ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని సత్రంవీధిలో నివాసం ఉంటున్న రమాదేవి తన కుమార్తె కాపురం విషయంలో జోక్యం చేసుకుంటోందని శనివారం రాత్రి ఆమెపై అల్లుడి తరఫు బంధువులు దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులు గాయత్రి, ప్రశాంతి, నరసింహులు, సాయిలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

శిథిలావస్థలో కొట్లపల్లి బ్రిడ్జి



ప్రమాదకరంగా కొట్లపల్లి వద్ద వంగపేరు బ్రిడ్జి

పుట్టపర్తి అర్బన్: కొట్లపల్లి సమీపంలో వంగపేరుపై నిర్మించిన బ్రిడ్జి కం కాజ్‌వే శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి కింది భాగంలో ఉన్న మట్టి, రక్షణ గోడ కొట్టుకుపోవడంతో ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చని కొట్లపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదరు బ్రిడ్జిపై పెనుకొండ, కోర్టు, నిడిమామిడికి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలతో రద్దీగా ఉంటుంది. వంగపేరు నుంచి నిత్యం ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో బ్రిడ్జి మరింతగా దెబ్బతిందని గ్రామస్తులు ఇటీవల రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. ఇది పడిపోతే పుట్టపర్తి నుంచి సుమారు 7 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిని కొత్తగా నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

వేరుశనగకు తెగుళ్ల బెడద

- ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాని వైనం
- పెరిగిన పెట్టుబడి వ్యయం
- ఆందోళనలో అన్నదాతలు



నల్లమాడ వద్ద తెగులు సోకి ఎర్రగా మారిన వేరుశనగ పంట



బూడిద తెగులుతో దిగుబడి లేని వేరుశనగ

నల్లమాడ: రబీ సీజన్‌లో బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటకు తెగుళ్ల బెడద తప్పడం లేదు. ఎన్ని మందులు పిచికారీ చేసినా తెగుళ్ల అదుపులోకి రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా బోరుబావుల కింద 24,233 ఎకరాలు, పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 6,710 ఎకరాల్లో రైతులు వేరుశనగ సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ రికార్డులను బట్టి తెలుస్తోంది. ఇది కేవలం ఈ పంట నమోదు చేసిన విస్తీర్ణం కాగా సాగు మరింత అధికంగానే ఉంటుందని అంచనా.

పెరిగిన చీడపీడల బెడద

ఇతర పంటల కంటే వేరుశనగకు చీడపీడలు, తెగుళ్ల బెడద అధికమైంది. పంటకు ఎర్ర వ్యాధి, ఆకుమచ్చ, బూడిద తెగులు, లద్దె పురుగు, దోమ ఆశించడంతో సుడి నల్లగా మారుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వేరుశనగ పిందె, కాయ దశలో ఉందని, ఈ దశలో ఆశించిన తెగుళ్ల, చీడపీడలు పంట దిగుబడి, కాయ నాణ్యతపై ప్రభావం చూపే అవకాశం అధికంగా ఉందని ఆవేదన చెందుతున్నారు.

భారంగా మారిన మందుల పిచికారీ

సాధారణంగానే వేరుశనగ పంట సాగుకు ఒక ఎకరాకు కనీసం రూ.30 వేలు పెట్టుబడి అవుతుంది. తెగుళ్ల, చీడపీడల నివారణ కోసం మందుల పిచికారీకి అదనంగా రూ.5 నుంచి రూ.6 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు నిట్టూరుస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో అప్పులు చేసి పంట సాగు చేశారు. పంటకు తెగుళ్ల బెడద ఎక్కువ కావడంతో పెట్టుబడి తడిసి మోపెడవుతోందని, ప్రభుత్వం కనీసం పురుగు మందులనైనా ఉచితంగా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పుట్టపర్తి నియోజకవర్గంలో వేరుశనగ సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
కొత్తచెరువు	2,130
బుక్కపట్నం	1,680
నల్లమాడ	1,070
పుట్టపర్తి	750
ఓడీ చెరువు	610
అమడగూరు	470

ప్రభుత్వం ఉచితంగా మందులివ్వాలి



వేరుశనగ పంటకు ఎక్కడ చూసినా తెగుళ్ల ఎక్కువయ్యాయి. నేను ఒకటిన్నర ఎకరాలో పంట వేశా. ఇప్పటికి మూడు సార్లు మందులు కొట్టా. మందుల కొనుగోలుకు రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఉచితంగా మందులు, ఎరువులు సరఫరా చేయాలి.

–జిక్రియా, రైతు, నల్లమాడ

ఏడుసార్లు మందులు పిచికారీ చేశా

రబీ సీజన్ కింద ఎనిమిదెకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. పంట ప్రస్తుతం కాయ దశలో ఉంది, తెగుళ్ల, చీడపీడల నివారణ, పంట సస్యరక్షణ కోసం ఇప్పటికి ఏడుసార్లు మందులు పిచికారీ చేశా. ఇందుకోసమే ఎకరాకు రూ.6 వేలకు పైగా ఖర్చయింది. ప్రభుత్వం రైతులకు పురుగు మందుల కోసం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలి.

–లక్ష్మీపతి, వంకరకుంట, నల్లమాడ మండలం

ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి



వేరుశనగ పంటలో 30 రోజుల్లోపు ముందస్తు తిక్కా కు(ఎర్ర) తెగులు సోకుతుంది. వేరుశనగ పంట పసుపు పచ్చగా మారుతుంది. దీని నివారణకు మ్యాంకోజెబ్ 2 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పంటకు పిచికారీ చేయాలి. పంట సాగు చేసిన 60 రోజుల తరువాత ఇదే తెగులు నివారణకు హెగ్జాకోనజోల్ 2ఎంఎల్ లీటరు నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలి. ముందస్తు చర్యలతోనే పంట సస్యరక్షణ సాధ్యం.

– శంకర్‌నాయక్, ఏఓ, నల్లమాడ

పింఛన్ పంపిణీపై వివాదం



కాలనీవాసులతో మాట్లాడుతున్న పోలీసులు

గాండ్లపెంట: కటారుపల్లి పంచాయతీ గొల్లపల్లి ఎస్సీ కాలనీలో పింఛన్ పంపిణీ సందర్భంగా వివాదం తలెత్తింది. చివరకు పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. వివరాలు.. శనివారం గ్రామంలో సచివాలయ సిబ్బంది ఒక చోట కూర్చొని లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. ఈక్రమంలో లబ్ధిదారుల ఆధార్‌కార్డులను సేకరించుకుని వరుస క్రమంలో ఇవ్వాల్సి ఉండగా ఇష్టానుసారం ఇవ్వడంతో లబ్ధిదారులు తాను ముందొచ్చానని, కాదు ముందొచ్చానంటూ వాగ్వాదానికి దిగారు. ఇదే విషయమై అదే రోజు రాత్రి రెండు వర్గాల మధ్య మరోసారి వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న కదిరి రూరల్ సీఐ నాగేంద్ర ఆదివారం ఎన్‌పీకుంట ఎస్ఐ వలీబాషా, తలుపుల ఎస్ఐ నరసింహులు, నల్లచెరువు ఎస్ఐ మక్బూల్‌బాషా గ్రామానికి ఇరువర్గాలకు సర్ది చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం రూరల్ సీఐ ఇరువర్గాల వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వివాదాల జోలికిపోకుండా శాంతియుతంగా ఉండాలని సూచించారు.

నేడు ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’

బత్తలపల్లి: తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

బెల్టుషాపుల పేరిట గిరిజనులకు మోసం

తనకల్లు: తండాల్లో బెల్టుషాపుల పేరిట అమాయకపు గిరిజనులను కూటమి నాయకులు మోసగిస్తున్నారని గిరిజన ప్రజా సమాఖ్య రాయలసీమ జిల్లాల యువజన అధ్యక్షుడు దుంగావత్ భాస్కర్‌నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తనకల్లు మండలం పోమేనాయక్‌తండాలో రవీంద్రానాయక్ అనే వ్యక్తికి బెల్టుషాపు ఇస్తామని చెప్పి కొక్కంటిక్రాస్‌లోని మద్యం షాపు నిర్వాహకులు రూ.లక్ష తీసుకొని మద్యం ఇచ్చారని పేర్కొన్నారు. తండాలో మద్యం అమ్ముకో ఏ అధికారి వచ్చినా తమ పేరు చెప్పు అని రవీంద్రానాయక్‌కు నమ్మబలికారన్నారు. అయితే ఆ తరువాత ఎక్సైజ్ అధికారులు తండాకు వచ్చి రవీంద్రానాయక్ వద్ద కర్ణాటక మద్యం ఉందని అతనిపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఎక్సైజ్ అధికారుల సహకారంతో కూటమి నాయకులు తండాల్లో అక్రమంగా బెల్టుషాపులను నిర్వహిస్తూ గిరిజన ప్రజల బ్రతుకులతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. ఎక్సైజ్ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి రవీంద్రానాయక్‌ను బెల్టుషాపును పెట్టుకోమని చెప్పిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గిరిజన సంఘాలన్నీ ఏకమై ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయ నిపుణుడు నాగరాజు

కదిరి అర్బన్: కుటాగుళ్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహావతార్ కాంతిధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దక్షిణ భారత ప్రకృతి వ్యవసాయ శిక్షణ నిపుణుడు నాగరాజు మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందుల ప్రభావం తగ్గించేందుకు, ఆరోగ్య ఉత్పత్తులు పెంచేందుకు ప్రకృతి వ్యవసాయ ఉత్తమ మార్గమన్నారు. రైతులు జీవామృతం, బీజామృతం, అగ్రిహార్మోన్లు, కాంపోస్టింగ్ వంటి సేంద్రియ విధానాలు అనుసరిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. స్వతంత్రంగా పక్షులు, చెట్లు, జీవమున్న ప్రతి ప్రాణి ప్రకృతిలో పంచభూతాల ద్వారానే ఎదుగుతూ జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. ఇవి ఎప్పుడూ మానవులు తమకు ఆధారం కాదని నిరూపిస్తున్నాయన్నారు. పంటలకు రసాయన ఎరువుల వాడకంతో ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రకృతిని నమ్మిన మహనీయులను ఆదర్శంగా తీసుకుని భావితరాలు తమ జీవన విధానాన్ని సాగించాలని సూచించారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి, ఏఓ శ్రీనివాసరెడ్డి, ఎర్త్ 360 వ్యవస్థాపకులు దినేష్, రెడ్స్ సంస్థ బానుజా, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో మైనార్టీలకు మొండిచేయి

ముదిగుబ్బ: కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో మైనార్టీలకు మొండి చేయి చూపించిందని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖలందర్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్‌లో మైనార్టీలకు కేవలం రూ.3350 కోట్లు ప్రకటించారని, ఇది గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.168 కోట్లు మాత్రమే పెరిగిందని తెలిపారు. బడ్జెట్‌లో మైనార్టీలకు కేటాయించింది కేవలం 0.066 శాతం మాత్రమేనని పేర్కొన్నారు. మైనార్టీల విద్యాభివృద్ధి కోసం కేటాయించిన నిధులు నిరాశాజనకంగా ఉన్నాయని తెలిపారు. మదర్సాలు, మైనార్టీల విద్యా పథకాల కేటాయింపులో కోత విధించడం బాధాకరమని పేర్కొన్నారు.

డప్పు ర్యాలీకి తరలిరండి



సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

పుట్టపర్తి టౌన్: మందకృష్ణ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో తలపెట్టిన డప్పు వాయిద్య ర్యాలీకి మాదిగలు రావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలో ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు మధు, గౌరవాధ్యక్షుడు తిప్పన్న ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్బీ స్టేడియం వద్ద ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పలక ఆంజనేయులు, నియోజవర్గం అధ్యక్షుడు సాకే రాయుడు, సీనియర్ నాయకులు ఫొటోసాయి, ఎస్టీడీ నరసింహులు, గంగాధర్, నారాయణస్వామి, నరశింహమూర్తి, ఆంజనేయులు, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న కాకతీయ పాఠశాల నిర్వాహకులు



డ్యాన్స్ చేస్తున్న కాకతీయ పాఠశాల విద్యార్థినులు

ధర్మవరం అర్బన్: విద్యార్థులు చదువుతోపాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ, టూటౌన్ సీఐ రెడ్డప్ప, ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సెల్‌ఫోన్ల వినియోగం తగ్గించుకుని టెక్నాలజీని చదువులో ఉన్నతికి ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల నిర్వాహకులు అతిథులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. గతేడాది పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పాఠశాల ఫౌండర్స్ శెట్టిపి రామిరెడ్డి, చెన్నక్రిష్ణమ్మ, కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పాల పొంగులు



పోట్లమర్రిలో పూజలందుకున్న ఆంజనేయస్వామి

బత్తలపల్లి: మాఘ మాసాన్ని పురస్కరించుకుని పలువురు మహిళలు మొదటి ఆదివారం పాల పొంగులు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాసం ప్రారంభమైనప్పటి నుంచి మాంసం భుజించడం మాని తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి ప్రదక్షణలు చేసి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రంలోనూ, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణస్వామి, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ముష్టూరు, పోట్లమర్రి శివాలయంలోనూ, గంటాపురం అప్పస్వామి ఆలయంలో మహిళలు కొత్త కుండలో నైవేద్యం చేసి పూజలు చేశారు.

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ మాసం తొలి ఆదివారం పురస్కరించుకుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి స్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు, గొడుగులు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ముందుగా భక్తులు గదాగుండం (సలయేరు)లో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చు కున్నారు. ఆలయంలో రాత్రి విడిది చేసిన భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు ఉరుములోళ్లతో కాటమయ్య (కాటికోటేశ్వర) స్వామి జీవిత చరిత్ర చెప్పించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మక్బూల్‌అహ్మద్, నాయకులు

ఎన్‌పీకుంట: మండలంలోని మరికొమ్మదిన్నె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహబుబ్‌బాషా(40) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్‌మక్బూల్ అహ్మద్ ఆదివారం గ్రామానికి చేరుకుని మహబుబ్‌బాషా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, నాయకులు తిరుమలనాయుడు, ఓబులరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంఈఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

అమడగూరు: మండల మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పలక ఆంజనేయులు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడిగా కొమ్ము హరిబాబు, ఉపాధ్యక్షుడిగా నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బాబయ్య, కోశాధికారిగా శ్వేతవాహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాదిగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ నాయకులు పేర్కొన్నారు.

రాత్రివేళల్లో ముమ్మరంగా గస్తీ



నల్లమాడ వద్ద వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా పోలీసులు, రాత్రి వేళ ముమ్మరంగా గస్తీలు నిర్వహిస్తూ వాహనాల తనిఖీ చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల జరుగుతున్న సంఘటనలు దృష్టిలో ఉంచుకొని చోరీల నియంత్రణ అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రాత్రివేళ ముమ్మరంగా గస్తీలు చేపడుతూ నైట్ బీట్ చెకింగ్‌లు ఏర్పాటు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగించిన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. హెల్మెట్ ఫేస్ వాష్‌పై అవగాహన కల్పిస్తున్నారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా, నాటు సారాలపై దాడులు చేస్తున్నారు.

గుర్రప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లోనికోటలోనున్న గుర్రప్పస్వామి ఆలయాన్ని ఇటీవల జీర్ణోద్ధరణ గావించారు. ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సుధాకర్, గంగాధర్, ప్రభాకర్, శశిధర్, సోమశేఖర్, రమేష్, రాము, రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాచర్ల దేవ జయంతి



నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

కదిరి టౌన్: సైదాపురంలోని చాకలి ఐలమ్మ దోబీఘాట్ వద్ద మడివాల మాచర్ల దేవ జయంతి వేడుకలను రజక సంఘం నాయకులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నాయకులు మడివాల మాచర్ల దేవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, నారాయణ, గంగాధర్, రెడ్డప్ప, నాగభూషణం, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘ఉపాధి’ సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న ఉపాధి హామీ సిబ్బంది

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టి 20 ఏళ్లు కావడంతో ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ అనీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఏపీఓ మాట్లాడుతూ 2006లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నార్పల మండలం బండ్లపల్లిలో పథకాన్ని ప్రారంభించారన్నారు. గ్రామీణ కూలీల స్థితిగతులను మార్చడానికి కేంద్ర ప్రభుత్వం 2005లో ఉపాధి హామీ చట్టం ద్వారా రూపొందించిందన్నారు. పథకం అమలులో సాంకేతికను వినియోగించడం ద్వారా సత్ఫలితాలను సాధించామన్నారు. పనుల కల్పన, సహజ వనరుల అభివృద్ధితో పాటు పండ్ల తోటల పెంపకం, భూ అభివృద్ధి పనులు పాడి పెంపకం, పశుగ్రాస క్షేత్రాలు తదితర వాటిని సమర్థవంతంగా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సిబ్బంది, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.